క్లుప్తంగా

సీనియర్ ఎన్టీఆర్‌కు స్వరాంజలి



విజయవాడకల్చరల్: సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను ప్రణవీ మ్యూజిక్ అకాడమీ, డాక్టర్ ఎన్టీఆర్ సాంస్కృతిక సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాయంలో సోమవారం నిర్వహించారు. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించతగిన నటుడు రామారావు అని అభివర్ణించారు. ఆకాశవాణి విశ్రాంత ప్రోగ్రాం నిర్వాహకుడు ఏబీ ఆనంద్ మాట్లాడుతూ కృష్ణాజిల్లా కళల కాణాచి అని తెలుగు సినిమా చరిత్రలో ఎన్టీఆర్ యుగం స్వర్ణయుగమన్నారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు గన్నె ప్రసాద్, పెరుమళ్ల గురునాథం, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు. కారుమంచి రాజు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లో గీతాలను ఆలపించారు.

శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయ ఆదాయం రూ. 3.60లక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీకాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. హుండీ ఆదాయం రూ. 3.60 లక్షలు వచ్చినట్లు ఈఓ పి.మోహన్‌రావు తెలిపారు. మూడు నెలల 12 రోజుల కాలానికి మొత్తం నాలుగు హుండీలను లెక్కించామన్నారు. మొత్తం రూ. 3,60,361, ఒక యూఎస్ డాలర్ వచ్చిందన్నారు. లెక్కింపులో వెండి, బంగారు నాణెలు రాలేదని అన్నారు. భక్తులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, పోలీసుల సమక్షంలో లెక్కింపు జరిగిందని పేర్కొన్నారు.

యనమలకుదురులో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీ పార్వతీదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. స్వామివారికి అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఎలక్ట్రీషియన్ మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా వచ్చిన లారీ ఢీ కొన్న ఘటనలో ఎలక్ట్రీషియన్ మృతిచెందిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నున్న ప్రాంతానికి చెందిన వర్ల బలరామకృష్ణ (47) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. ఈయన సోమవారం సాయంత్రం పనిమీద కొత్త గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళుతుండగా రెండో ఫ్లై ఓవర్ సమీపంలోని లచన్ బార్ వద్ద ఏపీ39జెడ్ 2573 నెంబరుగల లారీ బలరామకృష్ణను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బలరామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. బలరామకృష్ణ బావ ఉదయభాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వార్షిక తనిఖీలు, మరమ్మతుల కారణంగా 58వ డివిజన్ సింగ్‌నగర్ నందమూరినగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ తోటవారి స్ట్రీట్ ఫీడర్ పరిధిలోని తోటవారి వీధి, వైఎస్సార్ రోడ్, సిద్ధార్థ వీధి, సాగి హనుమంతరావు వీధి, వినాయక కాలనీ, భారతమాత కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

1న హనుమజ్జయంతి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీకోదండ రామాలయంలో వచ్చేనెల ఒకటో తేదీ శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఏడు గంటలకు నవ కలశ స్నపనం(9 కలశాలతో అభిషేకం), రజత, సువర్ణ, తమలపాకులతో సహస్ర నామార్చన జరుగుతుందన్నారు. భక్తులు హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

నెరవేరిన సొంతింటి కల

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో సాకారం
- ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం



ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు(ఫైల్)

పాయకాపురం(విజయవాడరూరల్): నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకంలో భాగంగా పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలు లేవని మోసం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా ఇళ్ల స్థలాలను గతంలో ఏ ప్రభుత్వం పంపిణీ చేయని విధంగా మహిళల పేరిట పంపిణీ చేసింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలో 14,986 మంది లబ్ధిదారులకు నున్న, కొండపావులూరు, సూరంపల్లి గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడం జరిగింది. వాటిలో 2,400 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయినవి. ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వమే ఒక్కో ఇంటికి లక్షా 80వేల రూపాయల ఆర్థిక సాయం కూడా చేసింది. మరో వెయ్యి ఇళ్ల నిర్మాణాలు శ్లాబు పూర్తి చేసుకోగా, మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. పేదల సొంతింటి కల నెరవేరే దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది.

జగనన్న ప్రభుత్వంలో పేదలకు న్యాయం..

దీర్ఘకాల సమస్యగా ఉన్న పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో న్యాయం జరిగింది. పేదల కోసం రెవిన్యూ, నగరపాలకసంస్థ అధికారులు సమన్వయంతో ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు.



నున్న గ్రామంలో జగనన్న కాలనీ

స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధికారులకు దిశానిర్దేశం చేశారు. జీఓ నెంబరు 32 ద్వారా గతంలో పునరావాస లబ్ధిదారులకు కేటాయించిన వాంబే కాలనీ, రాజరాజేశ్వరిపేటలోని 2,763 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడం జరిగింది. అలాగే నిషేధిత భూముల జాబితా సెక్షన్22(ఎ)లో ఉన్న భూములను సదరు జాబితా నుంచి తొలగించి సెంట్రల్ నియోజకవర్గంలోని 20,944 కుటుంబాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించడంతోపాటు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న భూసమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. అలాగే జీఓ నెంబరు 60 ద్వారా 100 గజాలలోపు ఉన్న 115 కుటుంబాల ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయడం జరిగింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ జీఓ 84 ద్వారా అర్హులైన 264 మందికి హక్కులు కల్పించడమైంది. ఆర్అండ్‌బీ స్థలంలో 69 కుటుంబాలకు ఇళ్లస్థలాల రెగ్యులైజేషన్ సమస్యకు పరిష్కారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే లభించింది.

రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ ప్రసాద్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ ఏసీపీ దేవరకొండ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఎన్‌పురం, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా ఏకకాలంలో రైల్వేస్టేషన్, పార్శిల్ కార్యాలయం, వెస్ట్ ప్రవేశద్వారం పరిసరాల్లో సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లోని వెయిటింగ్ రూమ్స్, డార్మెటరిలు, ప్రైవేటు రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న హోటళ్లు, లాడ్జిలు, డార్మెటరీలను తనిఖీ చేసి అనుమానితులను ఐరిష్ సాయంతో వారిపై గతంలో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో గతంలో కేసులు ఉన్న ఇద్దరు పాత నేరస్తులను రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తించి వారి రాకకు గల కారణాలను తెలుసుకునేందుకు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని హోటల్‌లు, లాడ్జిలు, డార్మెటరీలలో అనుమానిత వ్యక్తులు, సరైన గుర్తింపు లేని వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఏసీపీ దేవరకొండ ప్రసాద్ యజమానులను ఆదేశించారు. ఎస్ఎన్‌పురం, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు వెంకట నారాయణ, పి.శ్రీనివాస్, ఫతే అలీబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

నగర మార్కెట్‌లోకి సరికొత్త క్రూజర్ టైసర్ కారు



టయోట క్రూజర్ టైసర్ కారును ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సుబ్బారావు తదితరులు

రామవరప్పాడు: న్యూ టయోటా అర్బన్ క్రూజర్ టైస ర్ ఎస్‌యువీ కారును ఎనికేపాడులోని లక్ష్మి టయోటా షోరూమ్‌లో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సుబ్బారావు, లక్ష్మి టయోట సీఈవో రామకృష్ణ సోమవారం నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి టయోట జనరల్ మేనేజర్ అస్మతుల్లా మాట్లాడుతూ టయోట నూతనంగా ప్రవేశపెట్టిన న్యూ అర్బన్ క్రూజర్ టైసర్ కారు 1000 సీసీ టర్బో పెట్రోలు, 1200 సీసీ పెట్రో ఇంజన్, సీఎన్‌జీ మోడల్‌లో 12 వేరియంట్లలో కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కారులో 360 డిగ్రీల కెమెరా, హెడ్ అప్ డిస్‌ప్లే, 6 ఎయిర్ బ్యాగ్స్, క్రూజ్ కంట్రోలు, ట్విన్ ఎల్ఈడీ డీఆర్ఎల్, అలాయ్ వీల్స్ వంటి భద్రత ప్రమాణాలు కలిగి ఉందన్నారు. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ 7.73 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు ఉందని తెలిపారు. ఈ కారు 6 సింగిల్ టోన్, 3 డ్యూయల్ టోన్ రంగుల్లో లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ జనరల్ మేనేజర్ పవన్, వినియోగదారులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

- వర్షాకాలంలో పకడ్బందీగా కార్యాచరణ అమలుకు వీఎంసీ ప్రణాళిక
- మూడు సర్కిళ్ల పరిధిలో దోమల నివారణకు విస్తృత చర్యలు
- చురుగ్గా కాల్వల్లో యాంటీ లార్వా ఆపరేషన్‌లు
- డ్రెయిన్లలో ప్రతినిత్యం పర్యవేక్షణ
- డ్రోన్‌ల ద్వారా దోమల మందు పిచికారీ



పొక్లెయిన్‌తో కాల్వల్లో తూటికాడ, పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో నగరవాసులను ప్రతినిత్యం వేధిస్తున్న సమస్యల్లో దోమల ప్రభావం ప్రధానమైనది. వీటి నిర్మూలనకు వీఎంసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. దోమల ఉధృతి అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించిన వీఎంసీ అందుకు నివారణ చర్యలు చేపట్టింది. ఈ మేరకు నగరంలోని మూడు ప్రధాన కాల్వలైన బందరు, ఏలూరు, రైవస్ కాల్వల్లో, కాల్వగట్లపై, కాల్వల మలుపులు, బుడమేరు ప్రాంతాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది.

కాల్వలపై ప్రత్యేక దృష్టి....

నగరంలోని బందరు, ఏలూరు, రైవస్‌కాల్వలతోపాటు నగర పరిధిలో బుడమేరు విస్తరించిన డివిజన్లలో పడవలతో ఒక్కో కాల్వకు ఐదుగురు కార్మికులు కాల్వల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఒక్కో కాల్వలో ఒక్కో పడవ, బుడమేరుకు రెండు పడవల ద్వారా దోమల నిరోధానికి చర్యలు చేపట్టారు. అలాగే కాల్వలు మలుపురు తిరిగే ప్రాంతంలో అధికంగా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెట్లకొమ్మలు తొలగించడం ఈ బృందాల ప్రధాన పని. వీటితోపాటు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో ప్రత్యేక గ్యాంగ్ వర్కర్లు నిత్యం పూడిక తొలగింపు చేపట్టారు. ఇంకా ప్రతి డివిజన్‌లో ఇద్దరు కార్మికుల చొప్పున ఉదయం వేళల్లో స్ప్రేలు, సాయంత్రం వేళ్లలో యంత్రాలు, మ్యాన్యువల్‌గా ఫాగింగ్ చేపట్టారు. ఇంకా కాల్వగట్లు, కొండ ప్రాంతాలు, నదీతీర ప్రాంతాల్లో వీఎంసీ ప్రజారోగ్య బృందం ఇంటింటి సర్వేతోపాటు మురుగుకాల్వలు, సైడ్ డ్రెయిన్లలో ఆయిల్‌బాల్స్ వేస్తున్నారు.

ఖాళీస్థలాల్లో....

వర్షాకాలంలో కొద్దిపాటి వర్షం పడినా రోడ్లు వెంబడి పల్లపు ప్రాంతాల్లో, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఏర్పడుతున్న నేపథ్యంలో దోమ లార్వాలను మాత్రమే ఆహారంగా తీసుకునే గంబూషియా రకం చేపలను వదిలే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రెండులక్షల చేపపిల్లలను దిగుమతి చేసుకున్న వీఎంసీ మరో వారం రోజుల్లో ఐదు లక్షల చేపపిల్లలను దిగుమతి చేసుకోనుంది. ఇవి ప్రత్యేకంగా నీటి ఫ్లోటింగ్‌లేని ప్రాంతాల్లో వదిలి దోమ లార్వాలను నిర్మూలించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

ఫ్రైడే-డ్రైడేగా పాటించాలి

> నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని నీటి నిల్వలు ఉంచుకునే పౌరులు తప్పనిసరిగా వారంలో ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి. ఇలా చేయటం వల్ల ఇళ్లలో, ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉండే దోమలకు ఆవాసంగా ఉండే నీరు లేకపోవటంతో దోమల ఉధృతిని కొంతమేరకు తగ్గించవచ్చు.
>
> –సూర్యా నాయక్, బయాలజిస్ట్, వీఎంసీ



పడవలో నుంచి కాల్వల్లో దోమల మందు పిచికారీ చేస్తున్న వీఎంసీ సిబ్బంది



నివాస ప్రాంతాల్లో నిల్వ నీటిని పరీక్షిస్తున్న ప్రజారోగ్య అధికారులు



సైడ్ డ్రెయిన్లలో రసాయనాలు పిచికారీ చేస్తున్న దృశ్యం



డ్రెయిన్లలో ఆయిల్‌బాల్స్ వదులుతున్న వీఎంసీ ప్రజారోగ్య కార్మికులు

సేవాగుణం అలవర్చుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో తోటివారికి సాయం చేయడంతో పాటు సేవాగుణం అలవర్చుకోవాలని వాకర్స్ క్లబ్ ఫాస్ట్ గవర్నర్ డీవీఎస్ రామలింగరాజు, డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ అన్నారు. స్థానిక అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్ సమీపంలో సోమవారం ఎక్స్‌రే సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యాన దాతల సహకారంతో దాహార్తులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండే వేసవిలో దాతల సహకారంతో ప్రతీ ఏటా మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. ప్రజల అవసరాల మేరకు తోచినంతలో సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎక్స్‌రే సాంస్కృతిక సేవాసంస్థ నాయకుడు బీ ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో ప్రారంభమైన పాలిసెట్ కౌన్సెలింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. 4,001 ర్యాంకు నుంచి 8వేల ర్యాంకు వరకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 48 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. కార్యక్రమాలను అధ్యాపకుడు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. మంగళవారం 17,001 నుంచి 22వేలు ర్యాంకు వరకు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు.

వైఎస్సార్ కాలనీలో పోలీసుల తనిఖీలు

- ఐదుగురు సస్పెక్ట్ షీటర్ల గుర్తింపు
- అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు
- రికార్డులు లేని పలు వాహనాలు సీజ్



వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న పోలీసులు



వాహన చోదకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ గణేష్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో సోమవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు కాలనీకి చేరుకున్న పోలీసు సిబ్బంది ఆరు బృందాలుగా విడిపోయి నాలుగు బ్లాకులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొత్తపేట సీఐ గణేష్ పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది ఆయా బ్లాకుల్లో నివాసం ఉంటున్న వారి వివరాలు, వారు ఎంత కాలంగా నివాసం ఉంటున్నారనే సమాచారం సేకరించడంతో పాటు నివాసితుల గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. ఆయా బ్లాకుల ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు, ఆటోల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు లేని 5 ఆటోలు, 18 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. పోలీసులు తనిఖీ నిర్వహించిన బ్లాకులలో కొత్తగా అద్దెకు వచ్చిన వారి వివరాలు, అనుమానాస్పద వ్యక్తుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ గణేష్ మాట్లాడుతూ పోలింగ్ సమయంలో కాలనీ వాసులు చాలా చక్కగా పోలీసు శాఖకు సహకరించడమే కాకుండా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించారన్నారు. త్వరలో కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కాలనీలో తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేస్తామని తెలిపారు. తనిఖీల్లో 5 గురు సస్పెక్ట్ షీటర్లను గుర్తించడంతో పాటు వారి జీవన శైలిపై ఆరా తీస్తామని పేర్కొన్నారు. స్థానికంగా ప్రజలను ఏమైనా ఇబ్బందులకు గురి చేస్తున్నారా అని ఆరా తీశామని చెప్పారు. కౌంటింగ్ రోజున నగరంలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలపై పందేలు కట్టినా, అల్లర్లు సృష్టించినా, ర్యాలీలలో పాల్గొన్న వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్‌టౌన్ సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజికసేవతోనే సంస్థలకు మనుగడ



సామాజిక వేత్త హజరత్తయ్య గుప్తాను సత్కరిస్తున్న వాసవీ సభ్యులు

లబ్బీపేట(విజజయవాడతూర్పు): మానవుడిగా జన్మించిన ప్రతి ఒక్కరికీ, సామాజిక సంస్థలకు సేవే పరమావధి కావాలని సామాజికవేత్త, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. అప్పుడే వ్యక్తులకు పుణ్య ప్రాప్తి, సంస్థలకు దీర్ఘ కాలం మనుగడ ఉంటుందని పేర్కొన్నారు. లబ్బీపేటలోని ఓ హోటల్‌లో వాసవి జిల్లా 203 రెండవ మైక్రో కాబినెట్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన వక్తగా పాల్గొన్న హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వార్థ భావన లేకుండా నిర్మలంగా, నిజాయతీగా, నిష్కల్మషంగా సేవ చేపడితేనే నాయకత్వ శోభ సంతరించుకుని అందరి అభినందనలు అందుకోగలుగుతారని అన్నారు. వాసవి క్లబ్‌లలో సభ్యత్వం ఆర్యవైశ్యులదే అయినా సేవలు మాత్రం కుల, మతాలకతీతంగా అందించడంలో ప్రముఖ పాత్ర పోషించడం హర్షదాయకమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని తొలుత పాలకుర్తి గాయత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభకు జిల్లా గవర్నర్ కొత్త గణేష్ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ మాజేటి రాజా, సురేష్, చిట్టూరు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హజరత్తయ్య గుప్తాకు ఘన సత్కారం చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి వాసవి క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా వికాసం కోసం శిక్షణ



స్కూటీని అందిస్తున్న వాసవి విజయవాడ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళలు సాధికారతను సాధించేందుకు కృషి చేయాలని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూటీ శిక్షణ కార్యక్రమం ముగింపు సభను ఆ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసు మాట్లాడుతూ మహిళా వికాసం కోసం కళాశాల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా సాధారణ మహిళలు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా రెండు దశాబ్దాలుగా ఏటా వేసవిలో అనేక అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. స్కూటీలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని మరింత ధైర్యవంతులుగా, అనేక అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ఏడాది పొడవునా పలు కార్యక్రమాలు తమ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ నిర్వహిస్తుందని వివరించారు. స్కూటీ, కరాటే వంటి శిక్షణ ఏడాది పొడవునా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా వాసవి విజయవాడ సంస్థ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్‌కు స్కూటీని బహూకరించింది. కార్యక్రమంలో వాసవి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టా అమర్‌సుధీర్, మాజేటి రామచంద్రరావు, క్లబ్ ప్రముఖులు జల్లూరి శ్రీనివాసరావు, చిట్టా విజయశ్రీ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



రామవరప్పాడులో అంగన్‌వాడీలు, కిశోర బాలికల ర్యాలీ

రామవరప్పాడు: యుక్త వయస్సులో ఉన్న బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం ఏరియాలో సోమవారం 'రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని' పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న బాలికలు నెలసరి సమయంలో వచ్చే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. శానిటేషన్ ప్యాడ్‌ల వినియోగం పట్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టిక ఆహార పదార్థాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ రీటా, శారదా, కిశోర బాలికలు, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.